సాక్షి పల్నాడు

శనివారం । 17 । మే । 2025



వికసించిన మే పుష్పం

దుగ్గిరాల: దుగ్గిరాలలో శుక్రవారం పాస్టర్ మండేపూడి ఐజయ్య ఇంట్లో మే పుష్పం వికసించింది. సంవత్సరానికి ఒక్క సారి పూసే ఈ పుష్పం చూపరులు ఆకట్టుకుంటుంది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 512.70 అడుగుల వద్ద ఉంది. ఇది 136.3003 టీఎంసీలకు సమానం.



'ఆపరేషన్ సిందూర్' విజయోత్సవం

బాపట్ల: ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ శుక్రవారం బాపట్లలో నిర్వహించారు. మాజీ సైనికులు, మున్సిపల్ అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అత్యవసర వైద్య సేవలు కలేనా!

- గోల్డెన్ అవర్‌లో దక్కని వైద్యం
- ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు
- కూటమి ప్రభుత్వంలో ముందుకు సాగని అభివృద్ధి పనులు
- వినుకొండలో ట్రామాకేర్ సెంటరు ఏర్పాటు చేయాలంటున్న ప్రజలు

వినుకొండ: కొద్ది రోజుల కిందట శివాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. వారిలో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఇద్దరు తీవ్ర గాయాలు తగిలి ప్రాణాపాయస్థితిలో ఉన్నారు. వీరికి సకాలంలో వైద్య సేవలు అంది ఉంటే ప్రాణాలు దక్కేవి. కానీ వినుకొండలో అత్యవసర సేవలు అందుబాటులో లేవు. 90 కిలో మీటర్ల దూరంలోని గుంటూరుకు బాధితులను తరలిస్తుండగా మార్గంమధ్యలోనే ప్రాణాలు కోల్పోయారు. అలాగే గతేడాది గుంటూరుకు చెందిన ఓ పురహితుడి కుటుంబం ప్రమాదానికి గురైతే వైద్యం అందక ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఇటువంటి సంఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. వినుకొండలో అత్యసేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పాలకులుకానీ, అధికారులు కానీ శ్రద్ధ చూపడం లేదు. వినుకొండ నియోజకవర్గం చుట్టుపక్కల సుమారు 125 గ్రామాలు, తండాలు ఉన్నాయి. లక్షలాది మంది జనాభా నివసిస్తున్నారు. వీరంతా కూడా ఏరోజుకారోజు కూలి పనులు చేసుకుని పొట్ట నింపుకునే పేదలు. వైద్య సేవల కోసం నిత్యం వినుకొండ వస్తుంటారు. అత్యవసర సమయాల్లో సరైన వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారు.



వినుకొండ ప్రభుత్వ వైద్యశాల

అప్‌గ్రేడ్ కాని వైద్యశాల

వినుకొండలో 1962లో ప్రభుత్వ వైద్యశాల ఏర్పాటుచేశారు. అప్పటి నుంచి ఎలాంటి అభివృద్ధికి నోచలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 30 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేశారు. అత్యవసర సేవలు మాత్రం అందుబాటులోకి రాలేదు. వినుకొండ మేజర్ పంచాయతీ నుంచి 2005లో మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ పొందినప్పటికీ ఆస్పత్రి అభివృద్ధిలో ఏమాత్రం మార్పు లేదు. ట్రామా సెంటరు లేకపోవటంతో ప్రమాదం జరిగితే గోల్డెన్ అవర్స్‌లో వైద్యం అందక వందలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. గుంటూరు–కర్నూలు జాతీయరహదారి వినుకొండలో నుంచి వెళుతుంది. రాయలసీమ ముఖద్వారంగా వినుకొండ పేరుగాంచింది. వినుకొండ నుంచి రాయలసీమ వైపు కర్నూలు, శ్రీశైలం, మంత్రాలయం, బెంగళూరు, అనంతపురంతోపాటు, ఇటువైపు గుంటూరు, విజయవాడ హైదరాబాదు మహానగరాలను కలుపుతూ రహదారులు ఉండటంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గంలో ప్రమాదం జరిగితే అత్యవసర వైద్య సేవల కోసం 90 కిలోమీటర్ల దూరంలోని గుంటూరు జనరల్ హాస్పటల్‌కు వెళ్లాల్సి ఉంది. 150 కిలో మీటర్ల దూరంలోని కర్నూలు వెళ్లాల్సి ఉంది. అంత దూరం వెళ్లే లోపే క్షతగాత్రులు మార్గం మధ్యలోనే ప్రాణాలు కోల్పోయారు. ఎన్నో ఏళ్ల నుంచి ట్రామా కేర్ సెంటరు కోసం పోరాటం చేస్తున్నప్పటికీ మంజూరు కాకపోవటం గమనార్హం.

వైద్యులు కరవు

వినుకొండ సీహెచ్‌సీ సెంటరులో కనీసం ఆర్థోపెడిక్ వైద్యుడు లేకపోవటంతో కేవలం ప్రమాదం జరిగిందనటానికి ప్రభుత్వ వైద్యశాల గుర్తింపు అవసరం కాబట్టి ఆస్పత్రిలో పేర్లు నమోదు చేసుకునేందుకే చేరుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఆస్పత్రిలో ఎలాంటి శస్త్రచికిత్సలు జరగకపోవటం గమనార్హం. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులు వినుకొండలో ట్రామా కేర్ లేదని గుంటూరు, నరసరావుపేట వైద్యశాలలకు వెళుతున్నారు. లేనిపక్షంలో ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి వినుకొండలో ట్రామా కేర్ సెంటరు మంజూరు చేసేందుకు కృషిచేయాలని ప్రజలు కోరుతున్నారు.





వైద్యం అందక మృతి చెందిన రామాంజి, పగడాల రమణారెడ్డి (ఫైల్)

ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలి



పెరిగిన జనాభా దృష్ట్యా వినుకొండలో ట్రామా కేర్ సెంటరు ఆవశ్యకత ఎంతో ఉంది. గోల్డెన్ అవర్‌లో జరిగే వైద్యం అందుబాటులో లేకపోవటంతో ఎంతో మంది మార్గం మధ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. వినుకొండలో 100 పడకల ఆస్పత్రికి గత ప్రభుత్వం ఐదెకరాలు మంజూరు చేసింది. అనుమతులు కూడా మంజూరయ్యాయి. వెంటనే 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయడంతోపాటు, ట్రామా కేర్, డయాలసిస్ సెంటరును ఏర్పాటు చేయాలి.

– ఎం.ఎస్ ప్రసాద్, మాజీ చైర్మన్, వినుకొండ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ

ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు



ప్రభుత్వ వైద్యశాలలో ట్రామా కేర్ సెంటరు లేకపోవటంతో గత్యంతరం లేక ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. వినుకొండలో వెంటనే ట్రామా కేర్ సెంటరు ఏర్పాటు చేయాలి.

– కొత్తమాసు శివ, మాజీ సభ్యుడు వినుకొండ ప్రభుత్వ వైద్యాశాల అభివృద్ధి కమిటీ

గుంటూరు రిఫర్ చేస్తున్నాం

వినుకొండ నుంచి గుంటూరు వరకు ఎక్కడా ట్రామా కేర్ సెంటర్లు లేవు. ఇటీవల కాలంలో నరసరావుపేటలో కొంతమేర ట్రామా వైద్యం అందుబాటులో ఉంది. వినుకొండ వైద్యశాలలో ట్రామా సెంటరు లేకపోవటం, ఆర్థోపెడిక్ వైద్యుడి పోస్టు కూడా ఖాళీగా ఉండటంతో గత్యంతరం లేక అత్యవసర కేసులన్నీ గుంటూరు రిఫర్ చేస్తున్నాం.

– శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్, వినుకొండ సీహెచ్‌సీ

న్యూస్‌రీల్

జిల్లా వ్యాప్తంగా వర్షపాతం నమోదు

అత్యధికంగా అమరావతిలో 9.6 మి.మీటర్లు

నరసరావుపేట: మండు వేసవిలో జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వర్షపాతం నమోదైంది. అన్నీ మండలాల్లో కలిపి 396.8 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు వాతావరణ అధికారులు వెల్లడించారు. అమరావతిలో అత్యధికంగా 90.6 మి.మీ వర్షం కురవగా, అత్యల్పంగా బొల్లాపల్లి మండలంలో 1.2 మి.మీ నమోదైంది. మండలాల వారీగా పరిశీలిస్తే...మాచర్ల 3.2, వెల్దుర్తి 1.8, దుర్గి 2.0, రెంటచింతల 2.2, గురజాల 3.2, దాచేపల్లి 4.2, కారెంపూడి 2.4, పిడుగురాళ్ల 6.6, మాచవరం 5.6, బెల్లంకొండ 10.4, అచ్చంపేట 13.6, క్రోసూరు 14.0, పెదకూరపాడు 40.4, సత్తెనపల్లి 60,6, రాజుపాలెం 8.0. నకరికల్లు 4.8, వినుకొండ 1.6, నూజెండ్ల 2.8, శావల్యాపురం 2.8, ఈపూరు 3.4, రొంపిచర్ల 3.0, నరసరావుపేట 5.4, ముప్పాళ్ల 8.4, నాదెండ్ల 27.4, చిలకలూరిపేట 42.8, యడ్లపాడు 24.4 మి.మీ వర్షం కురిసింది.

డీఎస్సీకి 25,067 మంది దరఖాస్తు



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు ఉద్దేశించిన డీఎస్సీ–2025 దరఖాస్తు ఘట్టం ముగిసింది. గురువారం అర్ధరాత్రి గడువు ముగిసే సమయానికి ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1,143 పోస్టులకు 25,067 మంది దరఖాస్తు చేసుకున్నారు. అర్హత ప్రాతిపదికన సెకండరీ గ్రేడ్ టీచర్, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఒక దరఖాస్తు దాఖలు చేసిన అభ్యర్థులతోపాటు రెండు పోస్టులకు కలిపి దాఖలు చేసిన దరఖాస్తులతో కలుపుకొని ఆన్‌లైన్‌లో మొత్తం 43,570 దరఖాస్తులు దాఖలయ్యాయి. పురుష అభ్యర్థులు 8,431 మంది ఉండగా, మహిళా అభ్యర్థులు 16,636 మంది ఉన్నారు. ఇక ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) జూన్ 6వ తేదీ నుంచి జరగనున్న నేపథ్యంలో అభ్యర్థులు సన్నద్ధమవుతున్నారు. ఈనెల 20 నుంచి మాక్ టెస్ట్‌లు జరగనున్నాయి. 30 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడింగ్, జూన్ 6 నుంచి జూలై 6వ తేదీ వరకు ఆయా కేటగిరీల వారీగా పరీక్షలు జరగనున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1,143 పోస్టులు భర్తీ చేయనున్నారు. వీటిలో స్కూల్ అసిస్టెంట్ 622, ఎస్జీటీలు 521 ఉన్నాయి. వీటితోపాటు గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మరో 16 పోస్టులు భర్తీ చేయనున్నట్లుగా చూపారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో సబ్జెక్టుల వారీగా తెలుగు 42, హిందీ 57, ఇంగ్లీషు 69, గణితం 35, ఫిజికల్ సైన్స్ 58, బయోలాజికల్ సైన్స్ 86, సోషల్ 109, ఫిజికల్ ఎడ్యుకేషన్ 166తోపాటు సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 521 ఉన్నాయి.

పంచాయతీ వనరుల కేంద్ర భవన నిర్మాణ పనుల పరిశీలన



గుంటూరుఎడ్యుకేషన్: గుంటూరులోని జెడ్పీ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న జిల్లా పంచాయతీ వనరుల కేంద్ర భవన పనులను శుక్రవారం రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఎంవీఆర్ కృష్ణతేజ పరిశీలించారు. శుక్రవారం నగరానికి వచ్చిన కృష్ణతేజ, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాతోపాటు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో కలసి భవన నిర్మాణ పనుల పురోగతిపై చర్చించారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం జెడ్పీ కార్యాలయాన్ని సందర్శించిన కృష్ణతేజ శిథిలావస్థకు చేరిన పరిపాలన భవనానికి మరమ్మతులు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, జిల్లా పంచాయతీ అధికారి బీవీ సాయికుమార్, డ్వామా, డీఆర్‌డీఏ, జెడ్పీ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

తెనాలిటౌన్: స్థానిక శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం, వైకుంఠపురంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఏడు రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ఉదయం 9.30 గంటలకు నిత్యహోమం, కలశ పూజ, ఆలయ బలిహరణ వంటి కార్యక్రమాలను దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా చేపట్టారు. అదే విధంగా సాయంత్రం 6.30 గంటలకు శేషవాహనంపై స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మంతెన అనుపమ పర్యవేక్షించారు. అర్చకులు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధి నివారణకు పద్ధతులు పాటించండి

నరసరావుపేటలో ర్యాలీ, ప్రతిజ్ఞ



ర్యాలీకి పచ్చ జెండా ఊపుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రవి

నరసరావుపేట: జిల్లాలో డెంగీ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ చెక్, క్లీన్, కవర్ పద్ధతులు పాటించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డెంగీ మాసోత్సవ ర్యాలీకి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. తొలుత అందరి చేత డెంగీ అరికట్టేందుకు తమ వంతు సహకారం అందజేస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్ల పరిసరాల్లోని నీటితొట్లు, పనికి రాని వస్తువులు, కొబ్బరి బొండాలు, టైర్లు లాంటి వాటిలో వర్షపు నీరు నిలబడిందా లేదా అనేది చెక్ చేయాలన్నారు. నీరు నిల్వ ఉంటే నీటిని తొలగించి పనికిరాని వస్తువులు తీసివేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తొట్లు, డ్రమ్ములు, రోళ్లు, కుండలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, సంపులు లాంటి వాటిలో దోమలు చేరకుండా మూతలు వేయాలని అన్నారు. మలేరియా అధికారి రవీంద్ర మాట్లాడుతూ జూన్ నుంచి నవంబరు వరకు సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, బోదకాలు, చికెన్ గున్యా, మెదడు వాపు వ్యాధులు ప్రబలకుండా చెక్, క్లీన్, కవర్ విధానాలను పాటించి వ్యాధుల తీవ్రతను తగ్గించాలని కోరారు. ర్యాలీలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ హనుమకుమార్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి, ఏఎంఓ చుక్కా వెంకటేశ్వర్లు, ఎస్‌యుఓ కొల్లిపర శ్రీనివాస్, కుంచాల శ్రీనివాసరావు, పలు యూపీహెచ్‌సీలకు చెందిన ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

ఏడుగురికి యావజ్జీవ కారాగార శిక్ష

వ్యక్తిని కిరాతకంగా హత్యచేసిన కేసులో తీర్పు

- ఒక్కొక్కరికి రూ.2,000 జరిమానా
- పోలీసులను అభినందించిన జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

చీరాల రూరల్: ఓ వ్యక్తిని అతి కిరాతకంగా హత్య చేసిన కేసులో ఏడుగురు నేరస్తులకు యావజ్జీవ కారాగార శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.2,000 జరిమానా విధిస్తూ ఒంగోలు మూడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎ.పూర్ణిమ శుక్రవారం తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల మేరకు.. చీరాల మండలం వాడరేవు గ్రామానికి చెందిన మృతుడు మోసా సూరిబాబు (30) వద్ద రెండేళ్ల కిందట అదే గ్రామానికి చెందిన పిక్కి సింహాద్రి రూ.3 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లించమని సూరిబాబు అనేకసార్లు సింహాద్రిని అడిగినా అప్పు తీర్చలేకపోయాడు. అంతేకాక సూరిబాబుకు సింహాద్రి భార్యతో అక్రమ సంబంధం ఉన్నదని గ్రామంలో కొంతమంది చర్చించుకుంటున్న విషయం సింహాద్రి దృష్టికి వచ్చింది. ఈ విషయమై సింహాద్రి తనభార్యతో పాటు సూరిబాబుపై అనుమానం పెంచుకున్నాడు. అనుమానం పెనుభూతంగా మారడంతో సూరిబాబును ఎలాగైనా చంపాలని సింహాద్రి నిర్ణయించుకున్నాడు. ఈ విషయంలో సహకరించాల్సిందిగా సింహాద్రి తన కొడుకు, కూతురుతోపాటు గ్రామంలో మరో ఆరుగురు పిక్కి శాంతి, బొంది డేవిడ్, పిక్కి రాజు, పిక్కి ఆనంద్, పిక్కి సత్తెమ్మ, ఓరుపుల మాణిక్యరావుల సాయం కోరాడు. అందుకు అందరూ అంగీకరించడంతో సూరిబాబును చంపేయాలని పథకాన్ని అమలు చేసేందుకు వ్యూహ రచన చేశాడు.

కూతురు వివాహం పేరుతో..

అయితే సింహాద్రి తన కుమార్తెను మృతుడైన సూరిబాబుకు ఇచ్చి వివాహం చేస్తానని నమ్మించాడు. తన ఇంటికి భోజనానికి రావాలని సూరిబాబును ఐదు రోజుల నుంచి సింహాద్రి ఆహ్వానిస్తున్నాడు. 10 అక్టోబర్ 2023న రాత్రి 8 గంటల సమయంలో సూరిబాబు, సింహాద్రికి ఫోన్‌చేసి భోజనానికి ఆహ్వానించడంతో సూరిబాబు అంగీకరించాడు. సూరిబాబు భోజనానికి వస్తున్న విషయంపై నిందితులకు ముందుగానే సమాచారం అందించాడు. సింహాద్రి వారందరికి కర్రలు, ఇనుపరాడ్లు, పైపులు అందించి తన ఇంటిలో దాచాడు. సింహాద్రి మాటలు నమ్మిన సూరిబాబు రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన సింహాద్రితోపాటు అందరూ కలిసి సూరిబాబుపై ఇష్టమొచ్చినట్లు దాడి చేశారు. మృతుడు సూరిబాబు అక్క ఎల్లియమ్మ తన తమ్ముడు ఇంటి వద్ద లేకపోవడంతో అనుమానం వచ్చి తన బంధువులను తీసుకుని సింహాద్రి ఇంటికి వెళ్లింది. సూరిబాబు ఇక్కడకు రాలేదని సింహాద్రి కూతురు మరి కొందరు కలసి ఎల్లియమ్మ ఆమె బంధువులను అడ్డగించి వాదనకు దిగారు. ఇంటిలోపల ఏదో జరుగుతుందని అనుమానం వచ్చి ఎల్లియమ్మ ఆమె బంధువులు కలసి బలవంతంగా ఇంటిలోపలకు ప్రవేశించారు. దీంతో సూరిబాబు తీవ్రగాయాలతో రక్తపు మడుగులో పడి ఉండటం గమనించి చికిత్స నిమిత్తం ఆటోలో చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సూరిబాబును పరిశీలించిన డ్యూటీలో ఉన్న వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు సూరిబాబు అక్క ఎల్లియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పైన పేర్కొన్న నేరస్తులందరిపై ఈపురుపాలెం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది.

జీవిత ఖైదు.. జరిమానా..

బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ ఎ.మల్లికార్జునరావు నిందితులపై హత్యా నేరం కింద కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఒంగోలు మూడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎ.పూర్ణిమ కేసును పూర్తిస్థాయిలో విచారించారు. నిందితులపై ఉన్న నేరారోపణలను పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేవీ రామేశ్వరరెడ్డి పోలీసుల సాయంతో సరైన సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టి తన వాదలతో నిరూపించారు. దీంతో న్యాయమూర్తి ఏడుగురు నిందితులకు హత్యానేరం కింద జీవిత ఖైదు విధించడంతోపాటు ఒక్కొక్కరికి రూ.2,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. నేరస్తులకు శిక్షలుపడే విధంగా కృషిచేసిన అప్పటి సీఐ ఎ. మల్లికార్జునరావు, ప్రస్తుత సీఐ పి.శేషగిరిరావు, జిల్లా కోర్టు కానిస్టేబుల్ షేక్ కరిముల్లా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేవీ రామేశ్వరరెడ్డిని ప్రత్యేకంగా ఎస్పీ అభినందించారు.

మున్సిపల్ ఉద్యోగుల సస్పెన్షన్

- గతంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని చేతివాటం
- వివిధ చోట్ల పనిచేస్తున్న 10 మందిపై సస్పెన్షన్ వేటు
- మరికొందరిపై విచారణ

చిలకలూరిపేట: పురపాలక సంఘంలోని షరాఫ్ విభాగంలో గతంలో విధులు నిర్వహించిన ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి భారీగా నిధుల దుర్వినియోగానికి పాల్పడితే నిర్లక్ష్యంగా వ్యవహరించిన పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడింది. మరి కొంతమంది అధికారులపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన మరో మున్సిపల్ ఉద్యోగి ఇప్పటికే సస్పెన్షన్ కాగా ఆ వ్యవహారంలో సైతం మున్సిపల్ అధికారులు, సిబ్బంది వ్యవహారశైలి పలు సందేహాలకు తావిస్తోంది. చిలకలూరిపేట పురపాలక సంఘంలో ఐ గంగాభవాని షరాఫ్ విభాగంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా వ్యవహరించింది. ఈమె ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా వ్యవహరిస్తున్న క్రమంలో మే 2021 నుంచి జులై 2023 కాలంలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సులకు సంబంధించి వచ్చిన అద్దెలను పురపాలక సంఘానికి జమ చేయకుండా రూ.34,34, 397 అద్దెదారులకు డమ్మీ రశీదులు ఇచ్చింది. మరోవైపు 2024 ప్రాంతంలో షరాఫ్ వ్యవహరిస్తున్న జూనియర్ అసిస్టెంట్ ఎస్ జెస్సీ ప్రవీణ్ రూ.13,87,185 బ్యాంకులో జమ చేయకుండా దుర్వినియోగానికి పాల్పడటంతో అతనిని అప్పుడే సస్పెండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగి గంగా భవాని నిధుల దుర్వినియోగం వ్యవహారం వెలుగు చూసిన నేపథ్యంలో 2023 కాలంలో పలువురు కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశాల్లో నిలదీయడంతో అప్పుడు మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న చుక్కల గోవిందరావు ఆమె వద్ద నుంచి రూ.12,94,024 రికవరీ చేశారు. ఇంకా రూ.21,40,373 రికవరీ కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆమె అప్పటి నుంచి అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది.



చిలకలూరిపేట మున్సిపల్ కార్యాలయం

అధికారులపై కొనసాగనున్న విచారణ

ఈ వ్యవహారానికి సంబంధించి గతంలో ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసి ప్రస్తుతం అద్దంకి కమిషనర్‌గా ఉన్న డి రవీంద్ర, కొద్ది రోజులు ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరించిన ప్రస్తుత డీఈఈ షేక్ అబ్దుల్ రహీం, వ్యవహారం వెలుగు చూసిన కాలంలో ఇక్కడ కమిషనర్‌గా ఉండి, ప్రస్తుతం ఏపీ సచివాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా ఉన్న చుక్కల గోవిందరావు, ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏవోగా వ్యవహరిస్తున్న నగీనా సుల్తానా బేగంపై సైతం విచారణ కొనసాగనుంది.

పలువురి సస్పెన్షన్

మున్సిపల్ రెవెన్యూ విభాగంలో జరిగిన ఈ అవినీతి వ్యవహారానికి సంబంధించి విచారణ నిర్వహించిన మున్సిపల్ ఉన్నతాధికారులు పలువురిపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఈ నెల 14న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ అవినీతి వ్యవహారం చిలకలూరిపేట మున్సిపాలిటీలో జరిగిన కాలంలో ఇక్కడ వివిధ హోదాల్లో పని చేసి, ప్రస్తుతం వివిధ చోట్ల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై సీడీఎంఏ సస్పెన్షన్ విధించారు. ఈ వ్యవహారానికి సంబంధించి ప్రస్తుతం చిలకలూరిపేట పురపాలక సంఘంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న డి రమేష్‌బాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే అబ్దుల్‌ఖాదర్ సస్పెండ్‌కు గురయ్యారు. సస్పెండ్ అయిన వారి జాబితాలో ప్రస్తుతం నరసరావుపేట పురపాలక సంఘంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న జి శ్రీనివాసమూర్తి, సీనియర్ అకౌంటెంట్ టి ధనలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్లు షేక్ జమీర్, షేక్ అల్లాబక్షు, టి గురవయ్య ఉన్నారు. వీరితో పాటు కందుకూరులో ఆర్వోగా వ్యవహరిస్తున్న జి విజయలక్ష్మి, వెంకటగిరిలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న జి వెంకటేశ్వర్లు, చీరాలలో సీనియర్ అకౌంటెంట్‌గా ఉన్న ఎ మానసకృష్ణ ఉన్నారు. చిలకలూరిపేటలోనే జూనియర్ అసిస్టెంట్ పనిచేసి రిటైర్డ్ అయిన షేక్ కాలేషా పేరు సైతం జాబితాలో ఉంది.

పోలీసులకు ఫిర్యాదు చేశాం

ఈ మొత్తం వ్యవహారానికి సంబంధించి ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశాం. కేసు కూడా నమోదు అయ్యింది. సీడీఎంఏ ఉత్తర్వులను అనుసరించి ప్రస్తుతం చిలకలూరిపేట పురపాలక సంఘంలో పనిచేస్తున్న డి రమేష్‌బాబు, అబ్దుల్ ఖాదర్ అనే ఉద్యోగులపై సస్పెన్షన్ విధించాం.

– పి శ్రీహరిబాబు, మున్సిపల్ కమిషనర్, చిలకలూరిపేట

భూసేకరణకు ఒప్పుకోని రైతులు

కుందుర్రు, మావిళ్లపల్లిలో ప్రత్యేక గ్రామసభ

సంతమాగులూరు (అద్దంకి రూరల్): ప్రభుత్వం ఏర్పాటు చేసే సోలార్ ఇంధన ఉత్పాదక కేంద్రానికి తమ భూములు ఇవ్వబోమని గ్రామస్తులు ముక్తకంఠంతో పలికారు. సంతమాగులూరు మండలం మావిళ్లపల్లి గ్రామ రైతులు శుక్రవారం జరిగిన గ్రామసభలో చీరాల ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడుకు తెలియజేశారు. మండలంలోని కుందుర్రు, మావిళ్లపల్లి గ్రామాలలో 1500 ఎకరాల భూమి కావాలని అధికారులు కోరగా తాము భూమినే నమ్ముకుని వ్యవసాయం, పశుపోషణతో జీవానాన్ని వెళ్లదీస్తున్నామని గ్రామస్తులు తమ గోడు వెల్లబోసుకున్నారు. సోలార్ పార్క్ ఏర్పాటు పేరిట తమ భూములు లాక్కోవడం తీరని అన్యాయమని రైతులు ముక్తకంఠంతో నిరాకరించారు. దీంతో చేసిదిలేక రెవెన్యూ అధికారులు సభను అర్ధంతరంగా ముగించి వెళ్లిపోయారు.

విలువలతో కూడిన వైద్య సేవలు అందించాలి

- ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ చంద్రశేఖర్
- ఘనంగా గుంటూరు మెడికల్ కాలేజ్ డే వేడుకలు

గుంటూరు మెడికల్: వైద్యులు విలువలతో కూడిన సేవలు అందించాలని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో మెడికల్ కాలేజ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ వైద్యులు చికిత్స అందించే సమయాల్లో రోగులకు హాని జరగకుండా చూడాలన్నారు. గుంటూరు వైద్య కళాశాలలో చదివిన ఎంతో మంది దేశ, విదేశాల్లో పేరుప్రఖ్యాతులు పొందడం వైద్య కళాశాల గొప్పతనం అన్నారు. జింఖానా చేస్తున్న సేవలు ఎనలేనివన్నారు. వచ్చేనెలలో అన్ని వైద్య కళాశాలలను సందర్శించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ సుందరాచారి బాధ్యతలు చేపట్టిన ఆరు నెలల కాలంలో దాతల సహాయంతో రూ.కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేశారు. వాటిని వీడియో రూపంలో వీసీ ముందు ప్రదర్శించడంతా ఆవీడియోను తనకు పంపించాలని సూచించారు. అన్ని కళాశాలలు డాక్టర్ సుందరాచారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.



డాక్టర్ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న డాక్టర్ సుందరాచారి, డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ

రోగి నమ్మితే నీరు కూడా మెడిసినే...

వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకట సుందరాచారి మాట్లాడుతూ డాక్టర్‌లపై రోగులకు నమ్మకం ఉండేలా మన ప్రవర్తన ఉండాలన్నారు. రోగి నమ్మితే నీరు కూడా మందులా వారికి పనిచేస్తుందని, వారు డాక్టర్‌ను నమ్మకపోతే మందు ఇచ్చినా విషంలా భావిస్తారన్నారు. గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ మాట్లాడుతూ వైద్య కళాశాలలో కాలేజ్ డే సందర్భంగా నిర్వహించిన స్పోర్ట్స్, కల్చరల్ కార్యక్రమాల ద్వారా పవర్ నాలెడ్జ్ వస్తుందని చెప్పారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ.. ఎంబీబీఎస్ కరిక్యులమ్ చాలా ఎక్కువగా ఉంటుందని, ఎడ్రినా, తరంగ్ పేర్లతో కళాశాలలో నిర్వహించిన సాంస్కృతిక, క్రీడా పోటీలతో వైద్య విద్యార్థులకు ఆక్సిజన్ ఇచ్చినట్లు అవుతుందన్నారు. మరో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రభాకర్, జింఖానా కో ఆర్డినేటర్ డాక్టర్ బాలభాస్కరరావు, పలువురు బోధనా సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో విజేతలకు సుమారు 700 పతకాలు ప్రదానం చేశారు.

క్లుప్తంగా

జాబ్‌మేళా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నరసరావుపేట: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 21న చిలకలూరిపేటరోడ్డులోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో నిర్వహించే జాబ్ మేళా వాల్‌పోస్టర్‌ను శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆవిష్కరించారు. నియోజకవర్గం, పరిసర ప్రాంత యువతి యువకులు అందరూ ఈ జాబ్ మేళాలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాబ్ మేళాలో టెక్ మహేంద్ర, టెక్నో టాస్క్ బిజినెస్ సొల్యూషన్, మాస్టర్ మైండ్, గోదావరి ఆంధ్ర కార్పొరేటివ్ బ్యాంక్, అపెక్స్ సొల్యూషన్, వి చేంజ్ సొల్యూషన్, అక్రో సాఫ్ట్ సొల్యూషన్స్, హెటిరో డ్రగ్స్ వంటి సుమారు 21 కంపెనీలు హాజరవుతాయని తెలిపారు. జీతం వారి విద్యార్హతను బట్టి సుమారు రూ.10వేలు నుంచి రూ.40వేలు వరకు ఉండవచ్చని అన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజిరావు, రామాంజనేయులు, వీరాంజనేయులు, కృష్ణవేణి డిగ్రీ కళాశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. చిట్యాల ఎస్‌ఐ అఫ్రీన్ నసీహా తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా దాచేపల్లి మండలం తంగేడ గ్రామానికి చెందిన తోకల రవి (45), అతని తల్లి నాగమ్మ, డ్రైవర్ పోల్ సాగర్‌తో కలిసి కారులో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వస్తున్నారు. చిట్యాల మండలం వట్టిమర్తి పరిధిలోని దూన్ పంజాబీ దాబా వద్దకు రాగానే దాబా నుంచి లారీ అకస్మాత్తుగా జాతీయ రహదారిపైకి వచ్చి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న రవికి తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అతడిని వెంటనే నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు తోకల శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రైవేటు బడుల్లో ఉచిత ప్రవేశాలకు గడువు పెంపు

నరసరావుపేట ఈస్ట్: విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో 25 శాతం ఉచిత ప్రవేశాలకు ఈ నెల 19వ తేదీ వరకు దరఖాస్తు గడువు పెంచినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ వి.సుబ్బారావులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు స్వీకరణ గడువును ఈ నెల 15 వ తేదీ నుంచి పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు వివరించారు.

వజ్రోత్సవాలకు బాలఏసు ఆలయం సిద్ధం

మండలంలోని తాళ్లచెరువులో ఉన్న బాలఏసు దేవాలయం వజ్రోత్సవాలకు సిద్ధమైంది. గ్రామస్తుల సహాయ సహకారాలతో రూ.1.50 కోట్ల వ్యయంతో ఆలయాన్ని ఆధునికీకరించారు. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. 17, 18, 19వ తేదీలలో జరిగే వేడుకలలో పాల్గొనేందుకు రెండు తెలుగు రాష్ట్రాల క్రైస్తవ మత పీఠాధిపతులు, విచారణ గురువులు, భక్తులు రానున్నారు.

- రూ.1.50 కోట్లతో ఆధునికీకరణ పనులు
- మూడు రోజులపాటు జరుగనున్న వేడుకలు
- తెలుగు రాష్ట్రాల నుంచి తరలిరానున్న క్రైస్తవ ప్రముఖులు



బాలఏసు దేవాలయం

అచ్చంపేట: ఇంగ్లండుకు చెందిన స్వామి అరుణానంద 1892లో ఈ ప్రాంతాన్ని సందర్శించారు. స్థానికులకు క్రైస్తవ మతం గురించి బోధించారు. వ్యవసాయానికి అనుకూలమైన ఈ ప్రాంతంలో రెండు చెరువులు, చుట్టూ తాటిచెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండడాన్ని గమనించారు. గ్రామానికి తాళ్లచెరువుగా నామకరణం చేశారు. 1950లో బాలఏసు మందిరాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఏటా క్రిస్మస్ రోజు బాలయేసు తిరునాళ్ల నిర్వహిస్తూ వస్తున్నారు. ఇప్పుడు వజ్రోత్సవం నిర్వహించనున్నారు. స్థానికుల సహకారాలతో రూ.1.50 కోట్లతో దేవాలయాన్ని తీర్చిదిద్దారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పీఠాధిపతులు చిన్నాబత్తిన భాగ్యయ్య ఆలయాన్ని పునఃప్రతిష్ఠించి, స్వరూపములను ఆశీర్వదించి తాళ్లచెరువు గ్రామ క్రైస్తవసోదరులకు అంకితం చేయనున్నారు. గ్రామ సృష్టికర్త స్వామి అరుణానంద విగ్రహం వద్ద ప్రత్యేక ప్రార్థనలు ఉంటాయి. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలు గుంటూరు పీఠాధిపతులు డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్యతోపాటు వివిధ ప్రాంతాల నుంచి 8 మంది పీఠాధిపతులు, వందల సంఖ్యలో కన్యస్త్రీల సమక్షంలో వేడుకలు ఘనంగా జరగనున్నాయి. బాలఏసు దేవాలయ విచారణ గురువులు డాక్టర్ పుట్టి అంతొనిరాజు పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నారు. క్రైస్తవ భక్తులకు గ్రామంలోని సెయింట్ ఆన్స్ హైస్కూలు ఆటస్థలంలో అన్నదానం చేయనున్నారు.



ఆధునీకరించిన మందిరం లోపలి భాగం



స్వామి అరుణానంద

ప్రత్యేక కార్యక్రమాలు

17వ తేదీ సాయంత్రం 5 గంటలకు నెల్లూరు మేత్రాసన కో ఆజ్యుటర్ పీఠాధిపతులు రెవ.డాక్టర్ పిల్లి అంతోనిదాస్ ప్రారంభోత్సవ కృతజ్ఞత దివ్యపూజాబలి కార్యక్రమాలు జరుగుతాయి. రాత్రి 8 గంటలకు సెయింట్ ఆన్స్ ఇంగ్లిషు మీడియం స్కూలు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. 18వ తేదీన ఉదయం ఆటపాటలు, బ్యాండ్‌మేళం, కోలాటం ప్రదర్శనలు ఉంటాయి. సాయంత్రం 8 గంటల నుంచి గుంటూరు మేత్రాసన పీఠాధిపతులు రెవ. డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్యచే బాలఏసు దేవాలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు జరుగుతాయి. 19వ తేదీన జూబ్లీ దివ్య పూజా బలి, ప్రముఖుల సందేశాలతో ఈ వేడుకలు ముగుస్తాయి.

ప్రేక్షకాదరణ ఉన్నంతకాలం నాటకం సజీవం

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కందిమళ్ల జయమ్మ
- పేటలో ప్రారంభమైన నాటికల పోటీలు



జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించిన డాక్టర్ కందిమళ్ల జయమ్మ

చిలకలూరిపేటటౌన్ / యడ్లపాడు: ప్రేక్షకులు ఆదరించిన కాలం నాటకరంగం నిలిచి ఉంటుందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కందిమళ్ల జయమ్మ చెప్పారు. చిలకలూరిపేట కళానిలయం, సీఆర్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించే రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి 9వ ఆహ్వాన నాటికల పోటీలను శుక్రవారం ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం తొలిరోజు సభాకార్యక్రమం జరిగింది. చిలకలూరిపేట కళానిలయం అధ్యక్షులు చెరుకూరి కాంతయ్య అధ్యక్షత వహించిన ఈ సభలో ఆమె మాట్లాడుతూ కందిమళ్ల నారాయణమూర్తి స్థాపించిన కళా సదస్సు నియోజకవర్గంలో ఎందరో కళాకారులకు, రచయితల్ని, నాటక సమాజాలకు ప్రోత్సహించి వేదికగా నిలిచిందన్నారు. సినీ, టీవీ నటులు మల్లాది శివన్నారాయణ, కళాసదస్సు అధ్యక్షులు కందిమళ్ల నారాయణమూర్తి, డాక్టర్ ప్రఫుల్లాదేవి, రంగస్థల దర్శకులు, నటులు షేక్ షఫీ, ఆళ్ల హరిబాబు, కొత్త శివ, నాగభైరు బ్రహ్మానందం, మున్సిపల్ మాజీ ప్రతిపక్షనాయకులు షేక్ జమాల్‌బాషా పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

అనంతరం 'రైతేరాజు' నాటిక ప్రదర్శించారు. కంచర్ల సూర్య ప్రకాష్ రచించిన దీనికి కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించారు. ఈ నాటికను కళాంజలి హైదరాబాద్ వారు ప్రదర్శించారు. రెండో ప్రదర్శనగా 'మా ఇంటి మహాభారతం' నాటికను చిలకలూరిపేట మద్దుకూరి ఆర్ట్స్ సమర్పించగా, మద్దుకూరి రవీంద్రబాబు రచన, దర్శకత్వం వహించారు. 'బ్రహ్మస్వరూపం' నాటికను విజయవాడ మైత్రి కళానిలయం వారు ప్రదర్శించారు. శ్రీస్నిగ్ధ రచించారు. టీవీ పురుషోత్తం దర్శకత్వం వహించారు.

డెంగీపై అవగాహన ర్యాలీ



గుంటూరు మెడికల్: జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా గుంటూరు లాలాపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగీ వ్యాధి రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని పచ్చ జండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో వైద్య సిబ్బంది, ప్లకార్డులు చేతబూని దోమల నివారణ చర్యలపై అవగాహన కలిగిస్తూ నినాదాలు చేశారు. పట్టణ ఆరోగ్యకేంద్రం నుంచి యాదవ హైస్కూల్ వరకు ర్యాలీ కొనసాగి తిరిగి ఆరోగ్య కేంద్రం చేరింది. ర్యాలీలో కార్పొరేటర్ మీరావలి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, అసిస్టెంట్ మలేరియా అధికారి రాజునాయక్, వైద్యాధికారులు ఫిర్దోస్ అహ్మద్, అజిమా ఖాతున్, సబ్ యూనిట్ ఆఫీసర్లు ఘంటసాల శ్రీనివాసరావు, నరేంద్రబాబు, డెప్యూటీ మీడియా అధికారి ప్రశాంత్, వెంకటేశ్వర్లు, ఆరోగ్య విస్తరణ అధికారి శివగనేష్, హెల్త్ ఎడ్యుకేటర్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల పాకపై పడిన పిడుగు



ప్రత్తిపాడు: పశువుల పాకపై పిడుగు పడిన ఘటన పెదనందిపాడు మండలంలో చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతోపాటు ఈదురుగాలులు, మెరుపులు బీభత్సం సృష్టించాయి. పెద్ద శబ్దాలతో ఉరుములు ఉరుముతూ పిడుగులు పడ్డాయి. మండల పరిధిలోని గోగులమూడికి చెందిన సీహెచ్ నరసింహారావుకు చెందిన పశువుల పాకపై పిడుగు పడింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. పాకలో పశువులు లేకపోవడంతో నష్టం జరగలేదు. కాలిపోయిన పాకను మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కాశీంపీరాతో పాటు స్థానిక నాయకులు పరిశీలించారు. బాధితుడిని అడిగి వివరాలను తెలుసుకున్నారు.

అస్థిపంజరం గుర్తింపు

వివరాలు వెల్లడించిన తాడేపల్లి పోలీసులు



పోలీసులు వెలికి తీసిన పురుషుడి అస్థిపంజరం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం ఇప్పటం బకింగ్‌హామ్ కెనాల్ కట్ట వెంబడి ఉన్న డొంకరోడ్డు నుంచి పోలీసులు అస్థిపంజరం తరలించగా, మృతుడి వివరాలను తాడేపల్లి పోలీసులు శుక్రవారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ఖాజావలి మాట్లాడుతూ.. ఆదివారం అస్థిపంజరం ఉందని సమాచారం తెలియడంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించామన్నారు. అక్కడకు క్లూస్‌టీమ్‌ను పిలిపించి ఆధారాలు సేకరించామని తెలిపారు. అస్థిపంజరం కావడంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలోని ఫోరెన్సిక్ నిపుణులతో పోస్ట్‌మార్టం నిర్వహించామన్నారు. పురుషుడి అస్థిపంజరంగా తెలిపారని పేర్కొన్నారు. ఈ వివరాలను మిగిలిన పోలీస్‌స్టేషన్‌లకు పంపించామని, అక్కడ మిస్సింగ్ కేసులు ఉన్నాయా అనే విషయాన్ని పరిశీలిస్తున్నామని వెల్లడించారు. డీఎన్‌ఏ పరీక్ష ద్వారా ఆ మృతదేహం ఎవరిదో గుర్తిస్తామని తెలిపారు. ఇది హత్యా? ఆత్మహత్యా? అనే వివరాలు ఇంకా తెలియరాలేదని పేర్కొన్నారు. మిగిలిన వివరాలను త్వరలో వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

అదుపు తప్పి కారు బోల్తా

ఉండవల్లి అమరావతి కరకట్టపై ప్రమాదం



కారును కరకట్టపైకి లాగేస్తున్న పోలీసులు



ప్రమాదానికి గురైన కారు

తాడేపల్లి రూరల్: ప్రకాశం బ్యారేజ్ ఎగువ ప్రాంతంలో ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి ముఖ్యమంత్రి నివాసానికి కొద్ది దూరంలో శుక్రవారం కారు అదుపుతప్పి బోల్తా పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి ఉండవల్లి అమరావతి కరకట్ట మీదుగా సచివాలయానికి వెళుతుండగా కారు అదుపు తప్పి కిందకు జారిందని పోలీసులు తెలిపారు. తెల్లవారుజామున కురిసిన అకాల వర్షం కారణంగా కరకట్ట వెంబడి మార్జిన్‌లో ఉన్న మట్టి కరిగి ఈ ప్రమాదం జరిగిందని వెల్లడించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదన్నారు. అదుపుతప్పిన కారును క్రేన్ సహాయంతో బయటకు తీసి కేసు నమోదు చేశామని వివరించారు. కారును పైకి తీసే సమయంలో ట్రాఫిక్‌ను మళ్లించినట్లు పోలీసులు తెలిపారు.

దేశాభివృద్ధికి సాంకేతికత అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు వెస్ట్: దేశం అభివృద్ధి పథంలో పయనించాలంటే మానవ వనరులతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గత రెండు రోజుల నుంచి స్థానిక రింగురోడ్డులోని ఐటీసీ-వెల్కమ్ హోటల్లో భూ సర్వే, రికార్డుల డిజిటలైజేషన్‌పై జరుగుతున్న కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. కార్యక్రమంలో పెమ్మసానితోపాటు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ రికార్డులను డిజిటలైజ్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్నతాధికారులతోపాటు అనేక మంది మేధావులు ఈ వర్క్‌షాప్‌లో తమ అనుభవాలను పంచుకున్నారన్నారు. భవిష్యత్తులో ప్రజలకు భూ పరమైన సమస్యలు తలెత్తకుండా ఇది ఎంతో ఉపయోగంగా ఉంటుందని చెప్పారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ పట్టణాల్లో రెవెన్యూ రికార్డులు పక్కాగా అమలు చేయడం, భూ వివాదాలకు చెక్ పెట్టేందుకు నేషనల్ జియోస్పాటిల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్ (నక్షా) కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని చెప్పారు. పట్టణాల్లో పారదర్శకమైన, సమర్థ పాలన తీసుకొచ్చేందుకు ఇది దోహదపడుతుందని చెప్పారు. నక్షా పైలట్ ప్రాజెక్ట్ ద్వారా దేశంలో 152 మున్సిపాలిటీలను ఎంపిక చేశారని తెలిపారు. మన రాష్ట్రంలో కుప్పం, ఒంగోలు, అనంతపురం, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, కాకినాడ, మంగళగిరి, తాడేపల్లి, ఏలూరు, తిరుపతి నగరపాలక సంస్థలున్నాయని తెలిపారు. ఈ పది మున్సిపాలిటీల్లో ఉన్న 524 చ.కి.మీ. విస్తీర్ణంలో ఉన్న 9.5 లక్షల ఆస్తులను సర్వే చేసి డిజిటలైజేషన్ చేయనున్నామని తెలిపారు. రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ జి.జయలక్ష్మి, డీఓఎల్ఆర్ కార్యదర్శి మనోజ్ జోషి, డీఓఎల్ఆర్ డైరెక్టర్ డి.ఎస్. జోషి, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యానికి అధికారులదే బాధ్యత

- జాయింట్ కలెక్టర్ సూరజ్
- సత్తెనపల్లి డివిజన్ అధికారులతో సమావేశం



అధికారులతో మాట్లాడుతున్న జేసీ సూరజ్

నరసరావుపేట: రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ఏ ఒక్కటి ఆలస్యమైనా సంబంధిత రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ సమస్యలు ఉత్పన్నమైనప్పుడు వెంటనే రెవెన్యూ డివిజన్ అధికారి దృష్టికి తీసుకురావాలని, అక్కడ పరిష్కారం కాని పక్షంలో తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కార మార్గం చూపుతామని పేర్కొన్నారు. సివిల్ సప్లయస్ విధానంలో రెవెన్యూ తహసీల్దార్లు ఎక్కడా ఆరోపణలు రాకుండా రేషన్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ జరిగేలా చూడాలని జాయింట్ కలెక్టర్ కోరారు. రీ - సర్వే విషయంలో ఎక్కడి నుంచైనా రైతులు, సామాన్య ప్రజలు కానీ తమ సమస్యలను పరిష్కరించమని వస్తే ఆ విషయంలో ఎక్కడ అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. మిగతా రెవెన్యూ విషయంలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటి కప్పుడు తప్పనిసరిగాపై అధికారులకు తెలియజేసి పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. ఏడీ సర్వే, జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి, సత్తెనపల్లి ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి, సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఎంఎస్ఎస్‌లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి పీఆర్కే పరామర్శ



కుప్పాల అయ్యప్పరెడ్డి మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న పీఆర్కే, నాయకులు

దుర్గి : దుర్గి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన కుప్పాల అయ్యప్ప రెడ్డి మృతదేహాన్ని పల్నాడు జిల్లా వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం సందర్శించి, నివాళులు అర్పించారు. గురువారం అయ్యప్పరెడ్డి అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పీఆర్కే మాట్లాడుతూ.. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న అయ్యప్పరెడ్డి మృతి బాధాకరమని తెలిపారు. అందరితో కలిసిపోయే వ్యక్తి అన్నారు. సాగు పెట్టుబడికి తగినట్లుగా దిగుబడి వచ్చినప్పటికీ మద్దతు ధరలు లేక అప్పులపాలై, ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. నాయకులు సీతారామిరెడ్డి, కె.వరహాలరెడ్డి, అడపాల అంబారావు, కె.శివరామిరెడ్డి, రవికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు పూరిల్లు దగ్ధం



పిడుగుపాటుకు కాలిపోయిన నివాసం



దెబ్బతిన్న సామగ్రి

అమరావతి: మండల పరిధిలోని మండెపూడి హెల్త్ సబ్ సెంటర్ సమీపంలో పూరిల్లుపై గురువారం రాత్రి పిడుగు పడటంతో దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సఫావత్ సాంబయ్యకు చెందిన పూరిల్లుపై గురువారం అర్ధరాత్రి పిడుగు పడింది. ఇంటిలోని సామగ్రితో పాటుగా ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. సుమారు రూ.50 వేల వరకు నష్టం సంభవించింది. తహసీల్దార్ డానియేల్ మాట్లాడుతూ ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు. ఈ ఘటనపై నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నామని వివరించారు.

చేపల చెరువులో మునిగి జాలరి మృతి



ఏడుకొండలు (ఫైల్)

నూజెండ్ల: చెరువులో చేపలు పడుతూ ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని వి.అప్పాపురం గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ప్రకాశం జిల్లా ఒంగోలు మండలం చింతాయగారిపాలెం గ్రామానికి చెందిన చాపల ఏడుకొండలు (55) చేపలు పట్టే కూలీగా జీవనం సాగిస్తుండేవాడు. ఈ క్రమంలో వి.అప్పాపురం గ్రామంలో పరిసరాలలో తోటి వారితో కలసి రోజులాగే చెరువులో దిగి వల వేసి చేపలు లాగుతుండగా హఠాత్తుగా నీటిలో మునిగిపోయాడు. పక్కనే ఉన్న వారు అతనిని ఒడ్డుకు చేర్చి ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఏడుకొండలు మృతి చెందినట్లు తోటి జాలర్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఐనవోలు ఎస్సై బి.వి. కృష్ణారావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృత్యువాత



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



కొండమ్మ (ఫైల్)

నూజెండ్ల: త్రిపురాంతకం మండలంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నూజెండ్ల మండలానికి చెందిన మహిళ మృతి చెందింది. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధిలోని మృత్యుంజయపురం గ్రామానికి చెందిన వజ్రగిరి కొండమ్మ (45) తన బంధువులతో కలిసి పుల్లలచెరువు మండలం చౌటప్పచర్ల గ్రామంలో జరిగిన శుభకార్యానికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో గుట్టపల్లి వద్ద జాతీయ రహదారిపై వారు ప్రయాణిస్తున్న కారు వేగంగా కట్టెల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొంది. ప్రమాదంలో కొండమ్మ మృతి చెందింది. కారులో ప్రయాణిస్తున్న కొదమల కుమారి, షారోన్, ప్రశాంత్ రాజ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 సహాయంతో వినుకొండ వైద్యశాలకు తరలించారు.

ఆటో బోల్తా పడి వృద్ధురాలు మృతి

లక్ష్మీపురం: ఆటో బోల్తా పడి అందులో వెళ్తున్న వృద్ధురాలు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామానికి చెందిన ఇమ్మడి సామ్రాజ్యం (64) భర్త, బంధువులతో కలిసి శుక్రవారం తెల్లవారు జామున అదే గ్రామానికి చెందిన ఆటోలో జొన్నలగడ్డ నుంచి గుంటూరు రైల్వే స్టేషన్‌కు బయలు దేరారు. అరండల్‌పేట 11వ లైన్ వద్దకు చేరుకునే సరికి వర్షం, విపరీతమైన గాలుల వల్ల ఆటో బోల్తా పడింది. సామ్రాజ్యం తలకు తీవ్ర గాయం అయింది. దీంతో భర్త కృష్ణార్జునరావు, స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు వెల్లడించారు. అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించారు.